ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అస్తవ్యస్తంగా పారిశుధ్యం

- అధ్వానంగా మురుగుకాల్వల పరిస్థితి
- రోడ్లపై నుంచి పారుతున్న మురుగునీరు
- రాయికోడ్ మండలంలో ప్రజా సమస్యలను పట్టించుకోని అధికారులు

8

రూ.6.89 కోట్లతో

ఎత్తిపోతల పనులు

మనూరు, రేగోడు మండలాల్లో 3,400 ఎకరాలు సస్యశ్యామలం

గత పాలకుల నిర్లక్ష్యంతోనే నిర్వీర్యమైన ఎత్తిపోతలు

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



బోరంచ ఎత్తిపోతల ఫీల్డ్ గ్రావిటీ మెయిన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి దామోదర్, ఎంపీ, ఎమ్మెల్యే

మనూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లామనూరు మండలం బోరంచ వద్ద బోరంచ ఎత్తిపోతల పథకం ఫీల్డ్ గ్రావిటీ మెయిన్ పనులకు సోమవారం ఆయన జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.6 కోట్ల 89లక్షలతో చేపట్టనున్న పనులతో మనూరు, రేగోడు మండలాల్లో 3,400 ఎకరాలకు సాగునీరందుతుందని తెలిపారు. పనులను వేగంగా పూర్తిచేసేలా పర్యవేక్షించేందుకు ఐదుగురు సిబ్బందిని నియమించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఖేడ్‌ఆర్డీవో అశోక చక్రవర్తి, డీఈ జలెందర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రైతులు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ దర్శించుకున్న మంత్రి

అంతకుముందు ఆయన బోరంచ నల్ల పోచమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. మంత్రికి వేద మంత్రోచ్చరణల మధ్య పూర్ణకుంభంతో పురోహితులు ఆహ్వానించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మంజీరా నది ఒడ్డున వెలసిన సంగమేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు.



పిల్లికొటాల్‌లో కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రాశులు

వడ్లు కొంటలే..

కేంద్రాలు ప్రారంభించినా కొనుగోళ్లు లేవు

మిల్లర్లకు ధాన్యం కేటాయించడంలో ఆలస్యం

బ్యాంకు గ్యారెంటీ ఇస్తేనే ధాన్యం కేటాయింపులు

గ్యారెంటీ ఇవ్వడానికి సమయం చాలదంటున్న మిల్లర్లు

ప్రభుత్వ మార్గదర్శకాల కోసం సివిల్‌సప్లై అధికారుల ఎదురుచూపు

మెదక్ జిల్లాలో కొనుగోలు కేంద్రాలు తెరుచుకున్నా వడ్ల కొనుగోలు ప్రారంభం కాలేదు. మిల్లర్లకు ధాన్యం కేటాయించడంలో ఆలస్యం జరుగుతుండడమే ఇందుకు కారణం. గతంలో కేటాయించిన బియ్యానికి తగినంత సీఎంఆర్ ఇవ్వకుండా పలువురు మిల్లర్లు ఎగవేయడంతో ఈసారి అధికారులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. బ్యాంకు పూచికత్తు ఇస్తేనే ధాన్యం కేటాయిస్తామని పేర్కొంటున్నారు. కానీ, ఇందుకు సమయం పడుతుందని మిల్లర్లు పేర్కొంటుండడంతో వడ్ల కొనుగోళ్లు మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

మెదక్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లావ్యాప్తంగా 490 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే 350 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఇప్పటివరకు 30 శాతం వరి కోతలు పూర్తయ్యాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పది రోజులుగా వరి కోతలు ఊపందుకున్నాయి. కోసిన వడ్లను సెంటర్ల వద్దకు తరలించిన రైతులు ఆరబోయడంలో నిమగ్నమయ్యారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా ప్రభుత్వం ఇప్పటి వరకు రైస్‌మిల్లర్లకు ధాన్యం కోటా కేటాయించలేదు. తీసుకున్న ధాన్యానికి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వకుండా కొందరు మిల్లర్లు అక్రమాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకుంటోందని అధికారులు చెబుతున్నారు. బ్యాంకు గ్యారెంటీ ఇచ్చేంతవరకూ ధాన్యాన్ని కేటాయించకూడదని నిర్ణయించుకోవడంతో కాస్త ఆలస్యం అవుతోందని వివరిస్తున్నారు. బకాయిలు లేకుండా సీఎంఆర్ సక్రమంగా ఇస్తూ వచ్చిన రైస్ మిల్లర్లకు మాత్రం 10 శాతం బ్యాంకు గ్యారెంటీతో ధాన్యం కేటాయించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఒకవేళ డీఫాల్టర్ అయినప్పటికీ బాకీ తీర్చిన మిల్లర్లకు

మిగతా 8వ పేజీలో..

తగ్గిన సంపత్తి

- సగానికి తగ్గిన దిగుబడులు
- ఎకరానికి 6-8 క్వింటాళ్ల లోపే
- వర్షాభావంతో పంటకు నష్టం



7

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

ఇద్దరు మృతి

సదాశివపేట పట్టణ పరిధిలోని 65వ నంబరు జాతీయ రహదారి బైపాస్‌లో ప్రమాదం

7



రెండు వాహనాల మధ్య నలిగిన మృతదేహం

ఊరి కోసం గ్రంథాలయం

- తనలాగే యువత కొలువులు సాధించాలని..
- గ్రామానికి చెందిన పీడీ ఆలోచనలకు ప్రతిరూపం
- దాతల సాయంతో పుస్తకాలు

7





సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

టపాసుల దుకాణాలకు

అనుమతి తప్పనిసరి

సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా టపాసుల దుకాణాలను ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. ఇందుకోసం సంబంధిత సబ్‌డివిజన్ పోలీసు అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. దుకాణదారులు ఎవరైనా పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా టపాసుల దుకాణాలను ఏర్పాటు చేసినట్లయితే వారిపై ఎక్స్‌ప్లోజివ్ యాక్టు 1884 ప్రకారం కఠినచర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. టపాసుల దుకాణాలను జనావాసాలకు దూరంగా ఖాళీ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. రెసిడెన్షియల్/గృహనిర్మాణాలకు 50 మీటర్ల దూరంలో ఉండాలని తెలిపారు. ఫైర్‌యాక్సిడెంట్ జరిగితే తక్షణం స్పందించేలా టపాసుల దుకాణాల్లో ఫైర్‌సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

'ప్రజావాణి'కి సమస్యల వెల్లువ

మెదక్ జిల్లాలో 86, సంగారెడ్డి జిల్లాలో 66 ఫిర్యాదులు

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి కలెక్టర్ వల్లూరు క్రాంతి అర్జీలు స్వీకరించారు. కంగ్టి మండల కేంద్రంలో కుక్కలు, పందుల బెడద నుంచి ప్రజలను కాపాడాలని కుల వివక్ష పోరాట సంఘ(కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం ఆర్జీ అందజేశారు. దళితుల పట్టా భూములను ఎఫ్‌టీఎల్‌గా మార్చేందుకు ప్రయత్నం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండాపురం జగన్ భూ బాధితులతో కలిసి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, కలెక్టరేట్ ఏవో పరమేశం పాల్గొన్నారు.

86 అర్జీలు : కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వర పరిష్కార చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించేందుకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి వారి నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణికి మొత్తం 86 దరఖాస్తులు రాగా.. ఇందులో అధికంగా ధరణి 30, డబుల్ బెడ్‌రూం ఇండ్లు 14, రుణమాఫీ 3, పింఛన్లు2, ఉపాధి 1, ఇతర సమస్యలపై 36 అర్జీలు అందాయి. ప్రజావాణి అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, తమ పరిధిలోని లేనివాటికి తగిన సూచనలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి దరఖాస్తులను స్వీకరించారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.



సమస్య చెప్పుకుందామని వస్తే చేతి వేళ్లు తెగిపోయాయి..

కలెక్టర్‌కు తన సమస్యను విన్నవించి వస్తున్న క్రమంలో డోర్‌ని బలంగా నెట్టడంతో బాధితుడి చేయి తలుపులో ఇరుక్కుని చేతి వేళ్లు తెగిపోయాయి. జహీరాబాద్ మండలం బాగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన విఠల్ రాళ్లు కొట్టుకుంటూ జీవిస్తుంటారు. అధికారులు రాళ్లు కొట్టకుండా అడ్డుకుంటున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు చేసి వస్తుండగా.. సమావేశ మందిరం తలుపు వేసేక్రమంలో చేతి వేళ్లు తెగిపోయాయి. తీవ్రరక్తస్రావమవుతున్నా బాధితుడికి ప్రథమ చికిత్స చేసేందుకు కలెక్టరేట్‌లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ కూడా లేక కర్చీప్ కట్టుకుని ఆస్పత్రికి వెళ్లారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి



మెదక్‌లో పిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



అధికారుల బదిలీలు

ఉమ్మడి జిల్లాలో ఇద్దరు అదనపు కలెక్టర్లు, ముగ్గురు ఆర్డీవోలకు స్థానచలనం

సంగారెడ్డి టౌన్/సిద్దిపేట కలెక్టరేట్/మెదక్ అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో పలువురు అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులను జారీ చేసింది. మెదక్, సిద్దిపేట అదనపు కలెక్టర్లతోపాటు జహీరాబాద్, నర్సాపూర్, గజ్వేల్ ఆర్డీవోలు ట్రాన్స్‌ఫర్ అయ్యారు.

సిద్దిపేట అదనపు కలెక్టర్‌గా అబ్దుల్ హమీద్

రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్‌గా విధులను నిర్వర్తిస్తున్నా అబ్దుల్ హమీద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో బాధ్యతలను స్వీకరించిన న్నారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మం అదనపు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన 2022 జనవరి నుంచి నేటి వరకు జిల్లాలో విధులు నిర్వర్తించారు.

మెదక్ అదనపు కలెక్టర్‌గా మెంచు నగేష్

మెదక్ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) జి.వెంకటేశ్వర్లు వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వనపర్తి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న మెంచు నష్‌ను నియమించారు. అదనపు కలెక్టర్‌గా వెంకటేశ్వర్లు గతేడాది జూలై 21న బాధ్యతలు స్వీకరించగా పదిహేను నెలలు విధులు నిర్వహించారు. బదిలీపై వస్తున్న నగేష్ గతంలో మెదక్ ఆర్డీవోగా విధులను నిర్వహించారు. జిల్లాల పునర్విభజనలో జిల్లా డీఆర్వోగానూ బాధ్యతులు నిర్వర్తించారు.

నర్సాపూర్, జహీరాబాద్, గజ్వేల్ ఆర్డీవోలు బదిలీ

మెదక్ జిల్లాలోని నర్సాపూర్ ఆర్డీవోగా పనిచేస్తున్న జగదీశ్వర్‌రెడ్డిని కందుకూరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో హైదరాబాద్ ఆర్డీవోగా విధులు నిర్వహించిన కె.మహిపాల్‌రెడ్డి రానున్నారు. గజ్వేల్ ఆర్డీవో భన్సీలాల్ కొల్లాపూర్‌కు బదిలీ కాగా, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ శాఖలోని పబ్లికేషన్స్‌లో రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వీవీఎల్ చంద్రకళను నియమించారు. జహీరాబాద్ ఆర్డీవో, సంగారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవోగా ఉన్న ఎస్.రాజు మహబూబాబాద్‌కు బదిలీ అయ్యారు. జహీరాబాద్ నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ రవీందర్‌రెడ్డిని సంగారెడ్డి ఆర్డీవోగా నియమించారు. జహీరాబాద్ ఆర్డీవోగా మహబూబ్‌నగర్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.రాంరెడ్డి నియమితులయ్యారు. సివిల్ సప్లయ్ శాఖలో పనిచేస్తున్న బి.శకుంతల జహీరాబాద్ నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా రానున్నారు.

తండ్రి సోషల్ వర్కర్..

కొడుకులిద్దరూ డాక్టర్లు..

- పేదరికాన్ని జయించి.. ఎంబీబీఎస్ సీట్లు సాధించి..
- అన్నదమ్ములిద్దరికీ ప్రతిష్టాత్మక ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీట్లు



తల్లిదండ్రులతో లెనిన్‌రాజ్, స్టాలిన్‌రాజ్

పుల్‌కల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు పేదరికం వెంటాడుతున్నప్పటికీ.. అన్నదమ్ములిద్దరూ పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం న్యాహాన్నాపూర్ గ్రామానికి చెందిన నాగిరెడ్డిపల్లి కృష్ణంరాజు, భాగ్యలక్ష్మి దంపతులకు కూతురు, ఇద్దరు కుమారులు. కృష్ణంరాజు ముప్పై ఏళ్లుగా ఆయన సామాజిక కార్యకర్తగా ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించి గుర్తింపు పొందారు. సామాజిక ఉద్యమాలు, సింగూరు ప్రాజెక్టు ముంపు బాధితులకు అండగా ఉద్యమాలు చేపట్టారు. సింగూరు ప్రాజెక్టు నిర్మాణంతో సర్వస్వం కోల్పోయిన బాధితులకు పునరావాసం కల్పించేలా నాటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేకంగా నిర్వాసిత ప్రజల కోసం సింగూరు పునరావాస కార్యాలయం ఏర్పాటయ్యేలా కృషి చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను చైతన్య పరుస్తూ రాజ్యాంగం ప్రకారం వారికి దక్కాల్సిన న్యాయమైన హక్కుల కోసం పోరాడారు. పెద్ద కూతురుకు వివాహం జరిపించగా, ఇద్దరు కుమారులు నాగిరెడ్డిపల్లి లెనిన్‌రాజు, స్టాలిన్‌రాజులను ఎంబీబీఎస్‌లో సీటు సాధించేలా ప్రోత్సహించారు. వారిద్దరూ వైద్య విద్యలో సీట్లు సాధించడంతో పేదరికం వెంటాడుతున్నప్పటికీ

మిగతా 7వ పేజీలో..



పాపన్నపేట పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేస్తున్న మెదక్ ఎస్పీ

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

పాపన్నపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలకు ఐదు చొప్పున రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు జరుగుతున్నాయని, వీటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మహత్యలు, ప్రమాదాలు తగ్గించడానికి పోలీస్, నీటిపారుదల, రెవెన్యూశాఖలతో సమన్వయం చేసి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్సై సార శ్రీనివాస్ గౌడ్, ఏఎస్ఐ సంగయ్య, రైటర్ నర్సింహులు తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోహీర్, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి) కోహీర్ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ గోపతి సతీష్ తెలిపారు. గ్రామానికి చెందిన అఫ్రోజ్ కోహీర్ పట్టణంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని రేషన్ బియ్యం ఇక్రయ వ్యాపారాన్ని చేస్తున్నాడు. దీంతో పోలీసులు దాడులు చేసి నిల్వ ఉంచిన బియ్యాన్ని సీజ్ చేసి కోహీర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

25 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

కోహీర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండల పరిధిలోని బిలాల్‌పూర్, బడంపేట, పీచేర్యాగడి గ్రామాల్లో పేకాట ఆడుతున్న 25 మందిని అరెస్టు చేసినట్లు కోహీర్ ఎస్ఐ గోపతి సతీష్ తెలిపారు. వారి నుంచి ఏడు సెల్ ఫోన్లు, నాలుగు బైకులు, ఆరువేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

చేర్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన గీతకార్మికుడు బుడిగె కిష్టయ్య(65) సోమవారం తాటిచెట్టు పైనుంచి జారి కిందపడి దుర్మరణం చెందాడు. మృతుడికి ఇరువురు భార్యలు, ఐదుగురు కుమారులు ఉన్నారు.


కిష్టయ్య(ఫైల్)

విద్యుదాఘాతంతో మహిళ మృతి

వెల్దుర్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మన్నెవారి జలాల్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కాష రుక్కమ్మ(53) మనుమడి పుట్టిన రోజు కావడంతో ఇంట్లో వేడుకలకు ఏర్పాట్లు చేసుకున్నారు. కుటుంబ సభ్యులందరూ కలిసి ఇంటి బయటకు కూర్చున్నారు. సాయంత్రం కావడంతో ఇంట్లో విద్యుత్ బల్బు వేయడానికి వెళ్లిన రుక్కమ్మ తిరిగి బయటకు రాకపోవడంతో కూతురు స్వప్న ఇంట్లోకి వెళ్లి చూసేసరికి రుక్కమ్మ కుప్పకూలి ఉంది. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు..


రుక్కమ్మ (ఫైల్)

వ్యాపారులు.. అధికారుల మధ్య గలాట

హుస్నాబాద్ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం రాత్రి వ్యాపారులు, అధికారుల మధ్య పెద్ద గలాట చోటు చేసుకుంది. మార్కెట్ యార్డులో ఒకరిద్దరు ట్రేడర్లు బయట పచ్చివడ్లను కొనుగోలు చేస్తూ యార్డులోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ఇబ్బందులు సృష్టిస్తున్నారని వారిని అధికారులు మందలించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా పచ్చివడ్లను కొనుగోలు చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని మార్కెట్ అధికారులను కోరారు.

బీఆర్ఎస్ పార్టీకి సీనియర్ నేత రాజీనామా

వెల్దుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి వియ్యంకుడు వెల్దుర్తి మండల పరిధిలోని దామరంచ గ్రామానికి చెందిన సిద్దిరెడ్డిగారి రాజిరెడ్డి తన వ్యక్తి గత కారణాల వల్ల పార్టీకి, క్రియా శీల సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇకముందు తను ఏ పార్టీలో చేరబోనని, దామరంచ గ్రామ అభివృద్ధికి అందరితో కలిసి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన రాజిరెడ్డి ఎమ్మెల్యే సునీతారెడ్డి వెంట బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గత కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న రాజిరెడ్డి తన వ్యక్తిగత, వ్యాపార కారణాలతో పార్టీ రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.


రాజిరెడ్డి

క్రైం కార్నర్

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

● ఇద్దరు మృతి



ఘటనా స్థలంలో లారీల మధ్య పడి ఉన్న మృతదేహాలు

సదాశివపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టడంతో ఇద్దరు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే.. సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారు జామున షామీర్‌పేట నుంచి జహీరాబాద్ వైపు ఇటుకల లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ టైరు పంక్చర్ అయ్యింది. దీంతో సదాశివపేట పట్టణ పరిధిలోని 65వ నంబరు జాతీయ రహదారి (బైపాస్) పక్కన ఆపి మరమ్మతులు చేస్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వెళ్తున్న మరో లారీ అతివేగంగా వచ్చి వెనక నుంచి ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో మరమ్మతులు చేస్తున్న ఘట్‌కేసర్ ప్రాంతానికి చెందిన గైక్వాడ్ దీపక్ (55), పరమేశ్వర్ (37) అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల బంధువు కేతావత్ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

వాహనం ఢీకొని డీసీఎం క్లీనర్..



అబ్దుల్ ముబిన్ మృతదేహం

తూప్రాన్, అక్టోబరు 28 (ఆంధ్రజోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని డీసీఎం క్లీనర్ మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ శివారులోని హైవే బైపాస్‌లో దాబా హోటళ్ల వద్ద చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన అబ్దుల్ ముబిన్ (25) డీసీఎం క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి డీసీఎంలో హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యలో తూప్రాన్ హైవే బైపాస్‌లో దాబా హోటల్ వద్ద వాహనాన్ని ఆపి కాలకృత్యాలు తీర్చుకుని డీసీఎం పక్కన నిలబడ్డాడు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి అతడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

యువతి తల్లిదండ్రులు మందలించారని..

● యువకుడి ఆత్మహత్య

సదాశివపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సదాశివపేట మండలం మాలపాడు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన చిన్న మనగోని రంజిత్(19) పుల్కల్ మండలంలోని పుల్కల్ గ్రామానికి చెందిన తన తోటి విద్యార్థిని ఆదివారం పుట్టినరోజు వేడుకలకు ఆహ్వానించడంతో వెళ్లాడు. ఇది గమనించిన అమ్మాయి తల్లిదండ్రులు రంజిత్‌ను మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన అతడు ఆదివారం ఇంటికి రాకుండా సోమవారం తెల్లవారు జామున గ్రామ సమీపంలోని ఓ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.



వర్షానికి దెబ్బతినడంతో దున్ని వేసిన పత్తి పంట

తగ్గిన సంపత్తి

సగానికి పడిపోయిన దిగుబడులు

● ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల లోపే
● వర్షాభావ పరిస్థితులతో పంటకు నష్టం
● ఆందోళన చెందుతున్న రైతులు

మునిపల్లి, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి) : గత నెలలో ఎడతెరిపి లేకుండా 15రోజుల పాటు కురిసిన భారీ వర్షాల కారణంగా పత్తి రైతుల ఆశలు అడిఆశలయ్యాయి. పంట బాగుందిలే.. ఎకరానికి 15 క్వింటాల్‌కు దిగుబడి తగ్గదని అనుకున్న రైతన్నలు సగానితో (ఎకరానికి 8 క్వింటాళ్లతో) సరిపెట్టుకోవల్సి వస్తోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సొంత భూములు ఉన్న రైతుల పరిస్థితే ఇలా ఉంటే.. కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి ఇంకా ఎలా ఉందో చెప్పనక్కర్లేదు. పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా వస్తాయో రావోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి సాగు గతేడాదిలో రైతులకు ఎకరానికి సుమారు 12 నుంచి 1 5క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తే ఈసారి మాత్రం అందుకు భిన్నంగా దిగుబడులు వచ్చాయి. ముందు మురిపించిన పత్తి పంట చేతికందే సమయానికి వర్షానికి ఆహుతైంది. కొన్ని చోట్ల పంట అనుకున్న దిగుడులు రాలేదు. మరికొన్ని చోట్ల పూర్తిగా పంట నీటికి నల్ల బారడంతో తొలగించి రబీ (శనగ) పంట వేశారు. మండల వ్యాప్తంగా 32 వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. అందులో సుమారు 200 ఎకరాల్లోని పత్తి పంట భారీ వానలకు పూర్తిగా దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు.

భారీ వర్షాల కారణం..

ఈ సారి పత్తి పంట ఎకరాకు కేవలం 6నుంచి 8క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వస్తోందని రైతులు ఆవేదనం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 12 నుంచి 15 వరకు దిగుబడి వచ్చే తమ భూముల్లో భారీ వర్షాల కారణంగా దిగుబడి తగ్గిందని అన్నదాతలు వాపోతున్నారు. అనుకున్న పంట దిగుబడి రాలేకపోవడంతో పెట్టుబడి ఖర్చులు ఎలా రాబట్టాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ క్వింటాల్‌కు రూ.7520 నిర్ణయించినప్పటికీ ఈ దిగుబడులకు లాభాలు రావని, కనీసం రూ.10వేలు ఉంటేనే కొంతైనా లాభం చేకూరుతుందని రైతులు చెబుతున్నారు.

అనుకున్న పంట దిగుబడి రావట్లేదు



ఈ ప్రాంతంలో నల్ల రేగడి భూములు ఉన్నప్పటికీ పత్తి పంట అనుకున్న స్థాయిలో దిగుబడులు రావడం లేదు. పత్తి పంట విత్తు విత్తినప్పటి నుంచి పంట చేతికందే వరకు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. పెట్టుబడులు పోను.. మిగిలితే తమది. అయితే ఈ సారి మాత్రం అనుకున్న లాభాలు రావడం లేదు. సెప్టెంబర్ మాసంలో కురిసిన భారీ వర్షాల కారణంగా పత్తి కాయలు పూర్తిగా నల్లబారడంతో పాటు దిగుబడి తగ్గింది.

- బుచ్చయ్య, రైతు, మల్లికార్జున్ పల్లి

చిరిగిన గన్నీ సంచులు వాపస్



చిరిగిన గన్నీ సంచుల్ని తరలిస్తున్న సొసైటీ సిబ్బంది

మద్దూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : 'చిరిగిన గన్నీ సంచులతో ఇక్కట్లు' అంటూ ఈ నెల 24న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా సివిల్ సప్లై అధికారులు స్పందించారు. చిరిగిపోయిన సంచులను తిరిగి పంపించాలని జిల్లా సివిల్ సప్లై మేనేజర్ ప్రవీణ్ సూచించడంతో రేబర్తి సహకార సొసైటీలోని 18 వేల సంచులను వాపస్ ఇచ్చారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, సీఈవో బోయిని శ్రీధర్ 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

భరోసా కేంద్రంలో తనిఖీలు



భరోసా కేంద్రంలో తనిఖీ చేస్తున్న న్యాయాధికారి రమేష్

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని భరోసా, సఖీ, శిశుకేంద్రాలను న్యాయాధికారి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ సోమవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరోసా, సఖీ కేంద్రాల్లో బాధితులకు ఉచిత న్యాయ సేవలందించాలన్నారు. శిశువిహార్‌లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, శిశువులను దత్తత ఇచ్చేటప్పుడు అన్ని రకాల జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ప్రైవేటు ఆస్పత్రిలో వ్యక్తి మృతి

● వైద్యుల నిర్లక్ష్యమే కారణం : బంధువులు .. ఆస్పత్రి ఎదుట ఆందోళన



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

చేగుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చికిత్స చేస్తుండగా రోగి చనిపోయాడని తెలిసినా తమ మీదకు రాకుడదన్న ఉద్దేశంతో మరో ఆసుపత్రికి తరలించి చేతులు దులుపుకోవాలని చూశారు ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు. వివరాల్లోకి వెళ్తే చేగుంట మండల పరిదిలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన చందా యాదగిరి(50) టాయిలెట్ సరిగా రావడంలేదంటూ సోమవారం స్థానిక ఆర్ఎంపీ వద్దకు వెళ్లాడు. పరీక్షించిన ఆయన చేగుంటలోని ఓ ప్రైవేటు అసుపత్రికి వెళ్లాలని చెప్పడంతో కుటుంబ సభ్యులు యాదగిరిని అక్కడికి తీసుకెళ్లారు. దీంతో ఆ ఆస్పత్రి వైద్యులు యాదగిరికి ఉదయం నుంచి చికిత్స అందించారు. అయితే మధ్యాహ్నం ఆపరేషన్ అంటూ హడావిడి చేసిన డాక్టర్లు ఆ తరువాత మెదక్‌లోని మరో ఆస్పత్రికి తరలించాలని సూచించారు. తీరా అక్కడికి తీసుకెళ్లగా యాదగిరిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని తెలుపడంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా కంగుతిన్నారు. చేగుంటలోని ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే యాదగిరి మృతిచెందాడని, అయినా విషయం బయటకు వస్తే ఇబ్బంది అవుతుందని భావించిన వారు మరో అసుపత్రికి తరలింపజేశారని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. దీంతో యదగిరి మృతదేహాన్ని చేగుంటలోని సదరు ఆసుపత్రి ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయాడని, న్యాయం చేయాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు.

జహీరాబాద్ సీడీసీ చైర్మన్‌గా ముబీన్



నియామాక పత్రాన్ని అందుకుంటున్న ముబీన్

జహీరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ సీడీసీ చైర్మన్‌గా మొగుడంపల్లి మండలం అసద్‌గంజ్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ ముబీన్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో సోమవారం మంత్రి దామోదర రాజనర్సింహ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. సభ్యులుగా మండలానికి చెందిన మల్లారెడ్డి, మొగుంపల్లి మండలంలోని సజ్జరావుపేట తాండకు చెందిన చిన్నరాథోడ్ చందర్‌ను నియమించారు.

కోలుకున్న కేజీబీవీ విద్యార్థినులు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : న్యాల్‌కల్ కేజీబీవీలో అస్వస్థతకు గురై సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో చికిత్స పొందుతున్న బాలికల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడడంతో సోమవారం ఎనిమిది మందిని డిశ్చార్జ్ చేశారు. మూడు రోజుల కిందట కేజీబీవీ భవన నిర్మాణం, రంగులు వేయడం వల్లా దగ్గు, శ్వాస ఎలర్జీ సమస్యలతో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. అడ్మిటైన 10 మందిలో ఎనిమిది మంది ఆరోగ్యం కుదుట పడడంతో డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపగా, స్వల్ప అస్వస్థతలో ఉన్న మరో ఇద్దరికి చికిత్స అందిస్తున్నారు. వారిద్దరిని కూడా ఒకట్రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.జి.అనీల్‌కుమార్ తెలిపారు.

నేడు, రేపు స్పెషల్ ఎడ్యుకేషన్ సర్టిఫికేట్ వెరిఫికేషన్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2024లో మెరిట్ సాధించిన స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు ఈ నెల 29, 30 తేదీల్లో ఒరిజినల్ సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీటీ 1:3 మెరిట్ జాబితా డీఈవో సంగారెడ్డి వెబ్‌సైట్‌లో పొందుపర్చామని, అట్టి విద్యార్థులు సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయంలో ఉదయం 10 గంటల వరకు వచ్చి సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

కడీల తయారీకి విద్యుత్ చౌర్యం

మిషన్లను స్వాధీనం చేసుకున్న అధికారులు



అక్రమ విద్యుత్‌తో కడీలు తయారు చేస్తున్న కార్మికుడు

శివ్వంపేట, అక్టోబరు 28: ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద పెద్ద రాతి బండలను కట్ చేసేందుకు అక్రమార్కులు గుట్టు చప్పుడు కాకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతుండగా విద్యుత్ అధికారుల గుర్తించారు. ఈ మేరకు వైర్లను కట్ చేసి మిషన్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే మెదక్ జిల్లా శివ్వంపేట మండలం సీతారాం తండాలో సోమవారం పెద్ద పెద్ద గుండ్లను నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ చేయడమే కాకుండా మూడు నెలలుగా వ్యవసాయ పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి, తండాలోని సింగల్ ఫేజ్ బుడ్డి నుంచి అక్రమంగా విద్యుత్ వాడుతున్నారు. ఇతర రాష్ట్రాల కార్మికులతో బండ రాళ్ల నుంచి కడీలను తయారు చేయించి వాటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా విద్యుత్ అధికారులకు తెలిసినప్పటికీ అటువైపు వెళ్లి చూడకపోవడం గమనార్హం. అక్రమంగా విద్యుత్ ను వాడడం నేరమని చెప్పినప్పటికీ వినకపోవడంతో రెండుసార్లు వైర్లను కట్ చేసినట్లు లైన్‌మెన్ సురేష్ తెలిపారు. ఈ విషయమై తూప్రాన్ డీఈ రాజును సంప్రదించగా అనుమతులు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే ఉపేక్షించేది లేదని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు

అత్యాచారయత్నం కేసులో 20 ఏళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడికి 20 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి కె. జయంతి సోమవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన పి.దుర్గా ప్రసాద్ (24) అదే గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలికపై 27 జూలై 2017న అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు హత్నూర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలను పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టగా, నేరం రుజువు కావడంతో నిందితుడు దుర్గాప్రసాద్‌కు 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 20 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి జయంతి తీర్పు వెల్లడించారు. ఈ కేసులో నిందితునికి జైలు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ రూపేష్ అభినందించారు.

మరో ఘటనలో పదేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి కె. జయంతి సోమవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాలు ప్రకారం.. అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగమయ్య కాలనికి చెందిన కొట్టంవారి బస్వరాజ్(25) అదే కాలనీకి చెందిన ఓ బాలికపై 11 జూలై 2019న అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు బస్వరాజ్‌కు పదేళ్ల జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు.

5వపేజీ తరువాయి..

తండ్రి సోషల్ వర్కర్..

కొడుకులిద్దరూ డాక్లర్లు..

కొడుకులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్న పట్టుదలతో కొడుకులిద్దరినీ డాక్టర్ చదివిస్తున్నారు.

ఉస్మానియాలో వైద్య విద్య...

పెద్ద కుమారుడు లెనిన్‌రాజ్ పుల్కల్ మండలం బస్వాపూర్ తెలంగాణ ఆదర్శ పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసిన అనంతరం ప్రభుత్వ ఖర్చులతో కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు. 2021 నీట్‌లో మంచి ర్యాంకు సాధించి ఉస్మానియా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సంపాదించారు. ప్రస్తుతం ఎంబీబీఎస్ మూడో చదువుతున్నారు. రెండో కుమారుడు స్టాలిన్‌రాజు 2024 నీట్ ఎంట్రెన్స్‌లో మంచి ర్యాంకు సాధించగా.. ఇటీవల కౌన్సిలింగ్‌లో ఉస్మానియా వైద్య కళాశాలలోనే సీటు లభించింది. ప్రభుత్వ వైద్య కళాశాలలో సీట్లు వచ్చినప్పటికీ ఫీజులు భారంగా మారాయని కృష్ణంరాజు వాపోతున్నారు.



గతంలో ఏర్పాటు చేసిన పెంకుటిల్లు లైబ్రరీ, గ్రంథాలయ స్థాపకుడు గోవర్ధన్‌గౌడ్

ఊటి కోసం గ్రంథాలయం

● తనలాగే యువత కొలువులు సాధించాలని..
● గ్రామానికి చెందిన పీడీ ఆలోచనలకు ప్రతిరూపం
● దాతల సాయంతో పుస్తకాలు..

మనోహరాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అతను కష్టపడి చదివి.. ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. తనలాగే గ్రామానికి చెందిన యువత కూడా ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆశించాడు. చదువుకునే అవకాశం కల్పిస్తే.. తాను అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని భావించాడు. దాతల సహాయంతో ఓ పెంకుటింట్లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశాడు. పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌తో ప్రారంభించిన ఆ గ్రంథాలయంలో ఇప్పుడు వేలాది పుస్తకాలు కొలువుదీరాయి.

పుట్టిన గడ్డ కోసం..

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన పొట్టోళ్ల దశరథ, సుగుణమ్మల చిన్నకుమారుడైన గోవర్ధన్‌గౌడ్ పట్టుదలతో చదివి 15 ఏళ్ల క్రితం పీఈటీగా ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం శివ్వంపేట మండలం కొంతన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో పీడీగా పని చేస్తున్నారు. అయితే, పోటీ పరీక్ష రాసే సమయంలో మెటీరియల్ కోసం గ్రంథాలయంపై ఆధారపడేవారు. గ్రామంలో గ్రంథాలయం లేకపోవడంతో పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన తర్వాత తాను పుట్టిన గడ్డకు ఏదైనా చేయాలనే లక్ష్యం.. తనలాగే గ్రామ యువత ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడాలనే ఉద్దేశంతో 2012లో చిన్న పెంకుటింట్లో స్వామి వివేకనంద పేరుతో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలతో పాటు వివిధ కథల పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉంచారు. దాతలు సహకరిస్తే మరిన్ని పుస్తకాలు సమకూర్చుకుని నిరుద్యోగ యువతకు అందుబాటులో ఉంచుతానని ఈ సందర్భంగా గోవర్ధన్‌గౌడ్ చెప్పారు.

20కి పైగా కొలువులు

గోవర్ధన్ గౌడ్ ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయం ఎందరినో ప్రభుత్వ ఉద్యోగులను చేసింది. ఈ గ్రంథాలయంలో చదివిన సుమారు 20 మంది వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. 12 మంది పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించగా, ఇందులో ముగ్గురు ఎస్సైలు ఉన్నారు.



కానిస్టేబుళ్లుగా ఎంపికైన యువకులకు గ్రంథాలయంలో సన్మానం..

పెంకుటింటి నుంచి జీపీలోకి..

చిన్న పెంచుటింట్లో ప్రారంభమైన స్వామి వివేకనంద గ్రంథాలయం గ్రామ యువతకు అండగా నిలుస్తున్న విషయాన్ని గుర్తించిన గ్రామస్థులు దానికో చోటు కల్పించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో విశాలమైన గదిని కేటాయించారు. ప్రస్తుతం ఈ గ్రంథాలయంలో ఎప్పుడు కనీసం పది మంది చదువుకుటూ ఉంటారు.

ఇక్కడే చదివి ఎస్ఐ అయ్యా..



పోలీస్ కావాలనే ఉద్దేశంతో హైదరాబాద్‌లో కోచింగ్ సెంటర్‌లో చేరాను. మా బాబాయ్ గోవర్ధన్ గౌడ్ ప్రోత్సాహంతో ఇంటికి వచ్చి.. స్వామి వివేకానంద గ్రంథాలయంలో కూర్చొని ఇక్కడి పుస్తకాలను చదివాను. 2018లో ఎస్ఐ (సివిల్ సబ్ ఇన్స్‌పెక్టర్) ఉద్యోగం సాధించాను. గతంలో నాకు రైల్వే, పంచాయతీ కార్యదర్శి, ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగాలు వచ్చాయి. మా అక్క లావణ్య కూడా అదే సంవత్సరంలో సివిల్ ఎస్ఐ సాధించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని చిలకల్‌గూడ పీఎస్‌లో ట్రాఫిక్ ఎస్ఐగా విధులు నిర్వరిస్తున్నాను.

-హరీష్‌గౌడ్, ఎస్ఐ, మనోహరాబాద్

ఉద్యోగం రావడానికి కారణం ఈ గ్రంథాలయమే..



మాది మనోహరాబాద్. ఏడేళ్ల క్రితం పేపర్ చదివేందుకు స్వామి వివేకానంద గ్రంథాలయానికి వెళ్లాను. అక్కడే పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ చదివి ప్రిపేర్ అయ్యాను 2016, 2015లో ప్రభుత్వ ఉద్యోగానికి ప్రయత్నించి విఫలం అయ్యాను. గోవర్ధన్ ప్రోత్సాహంతో పట్టుదలతో చదివి 2020లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. ప్రస్తుతం శిక్షణ పొందుతున్నాను. గ్రామంలోని గ్రంథాలయంలో చదివి ఈ రోజు ప్రభుత్వ ఉద్యోగం సాధించగలిగాను.

-సరేష్, సివిల్ కానిస్టేబుల్

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోండి

సంగారెడ్డిటౌన్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో సేవలను హైదరాబాద్- సికింద్రాబాద్‌లలో ఇంటింటికీ అందిస్తున్నట్లు మెదక్ రీజినల్ కార్గో మేనేజర్ ఇసాక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు సేవలను వినియోగించుకోవాలన్నారు.

ఉద్యానవన పంటలు లాభదాయకం

కంది, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యానవన పంటల సాగు ఎంతో లాభదాయకమని ఉద్యానవన అధికారి శైలజ అన్నారు. సోమవారం మండలంలోని చేర్యాల, తోపుగొండ, కంది తదితర గ్రామాల్లోని రైతులతో కలిసి కూరగాయలు, పండ్ల తోటలను పరిశీలించారు. చీడ పీడలు సోకకుండా జాగ్రత్తలను సూచించారు.

ప్రభుత్వ భూమిని సంరక్షించండి

అల్లాదుర్గం, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిపెద్దాపూర్‌లో గల 863/1/1 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాచేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో గ్రామ యువకులు ఫిర్యాదు చేశారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆచార్యకళాశాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 28మంది విద్యార్థులు పాల్గొనగా 19 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. చింతల హరికుమార్, పలు కర్మాగారాల అధికారులు బాలక్రిష్ణ, శంకర్ కసిరెడ్డి, కళాశాల డైరెక్టర్లు వెంకట్‌రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, టాస్క్ కో-ఆర్డీనేటర్ నర్సింలు, అధ్యాపకులు, విద్యార్థులు. తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రవీణ్‌కుమార్‌కు డాక్టరేట్



మెదక్ అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న వై.ప్రవీణ్‌కుమార్‌కు జగదీష్ ప్రసాద్ యూనివర్సిటీ డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసింది. జేజేటీయూ ప్రొఫెసర్ అన్షుశర్మ పర్యవేక్షణలో సామాజిక అంశాలు, వ్యక్తులపై ప్రభావాలు అనే అంశంపై ఈనెల 26న ఆయనకు డాక్టరేట్ ప్రకటించారు.

గాంధీ విగ్రహం ఏర్పాటు గర్వ కారణం

సంగారెడ్డిటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానిలో మహాత్మా గాంధీ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపాజి అనంతకిషన్ పేర్కొన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో మహాత్మా గాంధీ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

కల్హేర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన పద్మ సంగమేశ్వర్‌కు చెందిన పాడి గేదె సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో మేస్తున్న గేదె ట్రాన్స్‌ఫార్మర్ సమీపం నుంచి వెళ్తుండగా విద్యుత్ తీగ గేదెపై పడటంతో మరణించినట్లు వారు తెలిపారు. రూ.80 వేల విలువ గల పాడిగేదె మరణించడంతో తనకు పరిహారం ఇప్పించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

నేడు ప్రజాదర్బార్

అల్లాదుర్గం, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులకు సంబంధించి నిర్వహించిన సామాజిక తనిఖీపై ఈ నెల 29న ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కార్యదర్శులతో ఎంపీడీవో సమీక్ష

నాగల్‌గిద్ద, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న కుల గణన సర్వేపై సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె. మహేశ్వర్‌రావు పంచాయతీకార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఎన్పీఆర్డీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బస్వరాజ్ పాటిల్

కల్హేర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జాతీయ వికలాంగుల హక్కుల వేదిక(ఎన్పీఆర్డీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని మార్డి గ్రామానికి చెందిన ముత్యం బస్వరాజ్ పాటిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఎన్పీఆర్డీ 4వ జాతీయ మహాసభల సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో బస్వరాజ్‌పాటిల్‌ను ఏకగ్రీవంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

పశువులకు ఉచిత వైద్య పరీక్షలు

హత్నూర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని లింగాపూర్‌లో సోమవారం పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్యరాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

నారాయణఖేడ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా చెల్లించాల్సిన బకాయి వేతనాలను మిషన్ భగీరథ పథకంలో ఔట్‌సోర్సింగ్ విధానంతో పనిచేస్తున్న ఉద్యోగులకు వెంటనే చెల్లించాలని మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే బకాయి వేతనాలను చెల్లించాలన్నారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం



రాయికోడ్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

- అధ్వానంగా మురుగుకాల్వల పరిస్థితి
- రోడ్లపై నుంచి పారుతున్న మురుగునీరు
- రాయికోడ్ మండలంలో ప్రజా సమస్యలను పట్టించుకోని అధికారులు

రాయికోడ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. మండల కేంద్రమైన రాయికోడ్‌లోని ఓ కాలనీలో మురుగునీరు రోడ్డుపై ప్రవహించడంతో ఆ కాలనీకి వెళ్లాలంటే అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రాయికోడ్‌లో ప్రధాన రహదారి నుంచి హనుమాన్ ఆలయానికి వెళ్లే దారిలో గల మురుగు కాలువ పూర్తిగా దెబ్బతినడంతో ప్రధాన రహదారి పైనుంచే మురుగు నీరు ప్రవహిస్తున్నది. ఆ రోడ్డుపై నుంచే పాండురంగ ఆలయానికి, హనుమాన్ ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు వెళ్తుంటారు. మురుగు కాలువ పూర్తిగా దెబ్బతినడంతో రోడ్డు పక్కన గృహాల్లోకి దుర్వాసన వ్యాపించడమే కాకుండా దోమల బెడద ఎక్కువైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలకేంద్రంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక ఆయా గ్రామాల్లోని పారిశుధ్య పరిస్థితి దుర్భరంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు.

'ప్రత్యేక' పాలనలో అన్నీ సమస్యలే

గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైనవిషయం తెలిసిందే. నాటి నుంచి ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులదే ఇష్టారాజ్యంగా మారింది. దీంతో గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితి అస్తవ్యస్తంగా మారి, అంతుచిక్కని జ్వరాలతో ఆస్పత్రులచుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొన్నదని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాలువల మరమ్మతులు జరిపించాలని, నూతనంగా మురుగు కాలువలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అంతేగాకుండా ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పరిస్థితులను తరచూ పర్యవేక్షిస్తూ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



మండలకేంద్రంలో మూసుకుపోయిన మురుగు కాల్వ

పశుగణనకు సహకరించాలి: మెదక్ కలెక్టర్



సర్వే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ గ్రామంలో ఇంటింటికీ పశువైద్య సిబ్బంది వచ్చి పశుగణన సమాచారాన్ని సేకరిస్తారని, వారికి సహకరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో పశుగణన కార్యక్రమం పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా అఖిల భారత పశుగణన కార్యక్రమం ఈ నెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుందన్నారు. జిల్లాలోని ప్రతీ గ్రామంలో పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పక్షులు తదితర 16 రకాల జంతు జాతులను లెక్కిస్తారన్నారు.ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా డాక్టర్లు 21 మంది, సూపర్‌వైజర్లు 81 మందిని నియమించామన్నారు.

పకడ్బందీగా సామాజిక, ఆర్థిక సర్వే చేపట్టాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సామాజిక, ఆర్థిక సర్వే పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో సర్వే, ప్రజాభిప్రాయ సేకరణ తదితర అంశాలపై అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 150 మందికి ఒక బ్లాక్ చొప్పున ఎన్యుమరేషన్ బ్లాక్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సర్వే ప్రక్రియ నవంబర్ 25 వరకు పూర్తి చేయాల్సి ఉన్నట్లు తెలిపారు.

ట్రైనీ అధికారులకు సన్మానం

క్షేత్రస్థాయిలో నేర్చుకున్న ప్రతి అంశం సరికొత్త అనుభూతినిస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలో 26 మంది ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల బృందంతో ఎనిమిది రోజుల పర్యటన ముగింపు సమావేశంలో వారితో సమీక్షించారు. మెదక్ జిల్లా క్షేత్రస్థాయి పర్యటన ఎంతో సంతృప్తిని ఇచ్చిందని ఈ సందర్భంగా ఆల్‌ఇండియా సర్వీసెస్ అధికారులు తెలిపారు. అనంతరం వారిని మెమెంటోలు, శాలువాతో కలెక్టర్ సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఇన్‌చార్జి పశుసంవర్థకశాఖాధికారి వెంకటయ్య, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు, డీపీవో యాదయ్య, చీఫ్ ప్లానింగ్ అధికారి బద్రినాథ్, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డైట్ క్యాంటీన్ కిచెన్ నిర్వహణ భేష్



జీజీహెచ్ డైట్ క్యాంటీన్ కిచెన్‌ను పరిశీలిస్తున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రి డైట్ క్యాంటీన్ కిచెన్ నిర్వహణ బాగుందని అని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ కితాబిచ్చారు. సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని డైట్ క్యాంటీన్ కిచెన్‌ను సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, వంటగది, భోజనశాల, ఆహార సరఫరా, శుభ్రత, సిబ్బంది వివరాలు, వంటశాల పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకు ముందు రోగులకు అందిస్తున్న ఆహారం, సామగ్రిని పరిశీలించారు. ఆమె వెంట ఆస్పత్రి చీఫ్ డైటీషియన్ బాలస్వామి, కాంట్రాక్టర్ ఎం.ఎ.జలీల్ ఉన్నారు. అనంతరం ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీశికాతో కలిసి సమీపంలోని ఓ విద్యాసంస్థ క్యాంటీన్‌ను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.

నేడు స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌పై శిక్షణ

మెదక్ అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌పై మంగళవారం ప్రధానోపాధ్యాయులతో పాటు కార్యక్రమ ఇన్‌చార్జి ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. అటల్ ఇన్నోవేషన్ మిషన్, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో ప్రారంభమవుతుందన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాణించాలి



శిక్షణ శిబిరంలో తెలంగాణ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్టు

మనోహరాబాద్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ బాలికల జట్టు విజయం సాధించాలని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్‌బాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న తెలంగాణ బాలికల సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని క్రీడా కారులను అభినందనలు తెలిపారు. నవంబర్ 8 నుంచి 12 వరకు జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరిగే 38 వ జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణ నుంచి ఈ బాలికల జట్టు పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్‌యాదవ్, కోశాధికారి గోవర్ధన్‌గౌడ్, సురేష్, అజయ్‌గౌడ్, వేణు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



పాపన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు



నర్సాపూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సునీతారెడ్డి

పాపన్నపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎల్లాపూర్, పొడ్చన్‌పల్లితండా, గాంధారిపల్లి, కొడుపాక, శేరిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాల్లో ఇప్పటి వరకు 473 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు.

ప్రతీ ధాన్యానికి బోనస్ ఇవ్వాలి: సునీతారెడ్డి

నర్సాపూర్/శివ్వంపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ప్రతీ ధాన్యానికి బోనస్ ఇచ్చి చిత్తశుద్ధి చాటుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నర్సాపూర్ పీఏసీఎస్ సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల హామీలో సన్న,దొడ్డురకం వరి ధాన్యంతో పాటు మొక్కజొన్న, కందులు తదితర వాటికి కూడా బోనస్ ఇస్తామని చెప్పారని, ఇచ్చిన మాట ప్రకారం ప్రతి పంటకు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. అదేవిధంగా శివ్వంపేట మండల పరిధిలోని గోమారం గ్రామంలో రామేశ్వరం, చండీ రైతు ఉత్పత్తి దారుల సంస్థ ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.

- జిన్నారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం సోలక్‌పల్లి, వావిలాలలో సోమవారం మండల వ్యవసాయ అధికారి రఘునాథ్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

కార్మికులకు అందుబాటులో ఉండేది సీఐటీయూ

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

జిన్నారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అండగా ఉండేది సీఐటీయూ మాత్రమేనని రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు అన్నారు. సోమవారం కాజీపల్లి పరిధి పారిశ్రామికవాడలోని టీజీడీసీ పరిశ్రమ గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పారిశ్రామిక రంగంలో కార్మికుల హక్కులు, సౌకర్యాలు సాధించేది సీఐటీయూ మాత్రమేనన్నారు. టీజీడీసీ పరిశ్రమలో జరిగే వేతన ఒప్పందం, ఇతర హక్కులను సాధిస్తామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి: తపస్





చిన్నశంకరంపేట, జహీరాబాద్ తహసీల్దార్లు మన్నన్, రవీందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

న్యూస్‌నెట్‌వర్క్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు, డీఏలు, పీఆర్సీ సమస్యలను పరిష్కరించాలని తపస్ ఉపాధ్యాయసంఘం నాయకులు పేర్కొన్నారు. తపస్ ఉపాధ్యాయసంఘం పిలుపు మేరకు కార్యాచరణలో భాగంగా సోమవారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ఆయా మండలాల్లో స్థానిక నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి తహసీల్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

వడ్లు కొంటలే..

(5వ పేజీ తరువాయి)

బ్యాంకు గ్యారెంటీని 20 శాతానికి పెంచనున్నట్లు తెలుస్తోంది. బకాయిలు తీర్చి, అపరాధ రుసుము చెల్లించని మిల్లర్లకు 25 శాతం బ్యాంకు పూచీకత్తు కోరనున్నారు. రెండు దఫాలు, లేదా అంతకంటే ఎక్కువగా డిఫాల్ అయిఉన్న మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు నిలిపివేసే అవకాశముంది.

పూచీకత్తు ప్రక్రియకు సమయం చాలేనా?

ఓవైపు జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. రైతులు నిత్యం రాశుల కొద్దీ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెస్తున్నారు. కానీ బ్యాంకు పూచీకత్తు ఇవ్వనిదే మిల్లులకు వడ్లు కేటాయించొద్దని ఆదేశాలు ఉండడంతో అధికారులు కొనుగోళ్లను ఇంకా ప్రారంభించలేదు. మరోవైపు మిల్లర్లకు కేటాయించడంలో ఆలస్యం కావడంతో అధికారులకు తలనొప్పులు తెస్తోంది. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు వెలువరిస్తుందని సివిల్‌సప్లై అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈసారి మిల్లింగ్ చార్జీల పెంపు

రాష్ట్రంలో ఈ సీజన్ నుంచి మిల్లింగ్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. గతంలో క్వింటాల్ ధాన్యం మర ఆడిస్తే రూ.10లు మాత్రమే ఇచ్చేవారు. ప్రస్తుతం దొడ్డురకం ధాన్యానికి రూ.45 లు ప్రకటించారు. ఇక సన్న రకం ధాన్యం మరాడిస్తే క్వింటాల్‌కు రూ.50 లు ఇవ్వనున్నారు. ఇక సన్నరకం ధాన్యం కొనుగోలు చేయడం తమవల్ల కాదని మిల్లర్లు భీష్మిస్తున్నారు. క్వింటాల్ ధాన్యం మరపడితే 60 కిలోలకు మించి బియ్యం రావని, మిగతా 7 కిలోలు నూకలుగా మారిపోతాయని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం క్వింటాల్ ధాన్యానికి 67 కిలోల బియ్యం ఇవ్వాలనడం సాధ్యం కాదని వాదిస్తున్నారు. అయితే ఈ సమస్యను కూడా మంగళవారం లోగా ప్రభుత్వం పరిష్కరించనుందని సివిల్‌సప్లై డీఎం హరికృష్ణ తెలిపారు.

నిలిచిపోయిన నిధులు వచ్చేలా చేస్తా: ఎమ్మెల్యే

నర్సాపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు గత ప్రభుత్వంలో వచ్చిన నిధులు నిలిచిపోయినందున, తిరిగి వచ్చే విధంగా ప్రత్యేక చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ మున్సిపల్ సాధారణ సమావేశం చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరైన నిధులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ నిధులు నిలిచిపోవడంతో పట్టణంలోని అనేక అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే అసంపూర్తిగా నిలిచిపోయాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. పెన్షన్‌దారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇక వార్డుల వారీగా వార్డు అధికారులే పంపిణీ చేసేలా అధికారులతో మాట్లాడుతానన్నారు. సమావేశంలో తహసీల్దార్ కె.శ్రీనివాస్, కమిషనర్ రామకృష్ణారావు, వైస్‌చైర్మన్ నయీం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైఫల్యాలను ఎండగడుతున్నందుకే కేటీఆర్‌పై కుట్ర

నర్సాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారనే మాజీ మంత్రి కేటీఆర్, ఆయన కుటుంబంపై ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తూ వేధింపులకు గురి చేస్తున్నదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆరోపించారు. సోమవారం నర్సాపూర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ బంధువులు కొత్త ఇంట్లో కుటుంబ సభ్యులతో ఫంక్షన్ చేసుకుంటుంటే పోలీసులతో దాడి చేయించి వేధించడం దారుణమన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

చేగుంటలో డీసీఎం బీభత్సం.. ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన కారు

చేగుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై డీసీఎం వ్యాన్ కారు, బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం మండలకేంద్రంలోని స్టేట్ బ్యాంక్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీకొట్టి తర్వాత మరో బైక్‌ను ఢీకొన్నది. అనంతరం పక్కనే చెట్టును ఢీకొని డీసీఎం ఆగిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఘటనలో రోడ్డుపై నిలబడిన వ్యక్తి తలకు వెన్నుముకకు తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంలో గ్రామానికి చెందిన డ్రైవర్ రబ్బాని తలకు వెన్నుముకకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. మరో వ్యక్తి హమాలీ కార్మికుడు గణేష్ కాలికి గాయమై స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేపట్టారు.

వాసవీక్లబ్ ద్వారా ఏటా రూ.30 కోట్ల సేవా కార్యక్రమాలు



అవార్డులు అందుకున్న వాసవీక్లబ్ సభ్యులు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని విద్యానగర్ కమ్యూనిటీహాల్‌లో సోమవాం వాసవీ క్లబ్ రీజియన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నామ భాస్కర్ పద్మ దీపోత్సవం పేరుతో అంగరంగ వైభవంగా కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా వాసవీ క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు హరీశ్‌బాబు హాజరై మాట్లాడుతూ.. వాసవీ క్లబ్ ద్వారా ఏడాదికి రూ.30 కోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం రీజియన్ పరిధిలోని 10 క్లబ్స్‌కు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపాజిఅనంతకిషన్, వాసవీక్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపేంద్ర, సంయుక్త కార్యదర్శి పుల్లూరు ప్రకాశ్, సీనియర్ ఉపాధ్యక్షుడు రాజేందర్, సుధారాణి, నర్సింలు, డిస్ట్రిక్ట్ సెక్రటరీ మురళీధర్, కోశాధికారి మనోజ్‌కుమార్, వైస్ గవర్నర్ ప్రదీప్‌కుమార్, ఇన్‌చార్జిలు విద్యాసాగర్, శ్రీనివాస్, నరేందర్, నరేంద్ర, నామశ్రీనివాస్, మహేశ్, విజయభాస్కర్, లక్ష్మణ్, శారద పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



యూసుఫ్‌పూర్‌లో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయికోడ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని యూసుఫ్‌పూర్ గ్రామ యువ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తన కుమారుడి వీరేష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం దీపిక, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట ఏఎంసీలో నలుగురు డైరెక్టర్లు

- పుల్కల్, చౌటకూర్ మండలాలకు ఇద్దరేసి చొప్పున



ఎర్ర ప్రతాపసింహం, కమాల్‌రెడ్డి, డప్పు శంకర్, దానంపల్లి బాలయ్య

పుల్‌కల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లో పుల్కల్, చౌటకూర్ మండలాలకు చెందిన ఇద్దరేసి కాంగ్రెస్ కార్యకర్తలకు చోటు లభించింది. పుల్కల్ మండలంలోని పెద్దారెడ్డిపేట గ్రామానికి చెందిన ఎర్ర ప్రతాపసింహం, ముద్దాయిపేట గ్రామ మాజీ సర్పంచ్ కమాల్‌రెడ్డి, మండల కేంద్రం చౌటకూర్‌కు చెందిన డప్పు శంకర్, కోర్పోలు గ్రామానికి చెందిన దానంపల్లి బాలయ్యలను డైరెక్టర్ పదవులు వరించాయి. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల కార్యకర్తలుగా పనిచేస్తున్నారు. పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ డైరెక్టర్ పదవులకు నామినేట్ చేశారు. డైరెక్టర్లుగా నియామకమైన నలుగురు ఆదివారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.

మంత్రి పొంగులేటిని సన్మానించిన ఖేడ్ ఎమ్మెల్యే



మంత్రిని సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాలశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కవలంపేటలో మసీద్ నూతన కమిటీ



కవలంపేటలో హష్మీ మసీద్ నూతన కార్యవర్గం

కంది, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని కవలంపేటలో ఉన్న హష్మీ మసీద్ కమిటీ నూతన కార్యవర్గాన్ని 30ఏళ్ల తర్వాత ఎన్నుకున్నారు. సోమవారం హష్మీ మసీద్, మహబూబా మదర్సా వద్ద కమిటీ సభ్యులను ముస్లిం మత పెద్దలు పూలమాలలతో సన్మానించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా జాఫర్, ఉపాధ్యక్షుడిగా అసద్, జనరల్ సెక్రెటరీగా బురాన్, జాయింట్ సెక్రెటరీగా మహ్మద్ బాబాసాబ్, మెంబర్లుగా అబ్దుల్ మన్నన్, సిద్దిఖ్ అలీను ఎన్నుకున్నారు. సోమవారం హష్మీ మసీద్, మహబూబా మదర్సా వద్ద కమిటీ సభ్యులను మతపెద్దలు సన్మానించారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలి

జహీరాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఇన్సూరెన్స్ కంపెనీలకు హెడ్‌గా వ్యవహరించే ఐఆర్డీఏ(ఇన్సూరెన్స్ రెగ్యూలెటరీ డెవలప్‌మెంట్ అథారిటీ), ఎల్ఐసీ యాజమాన్యాల వైఖరిని నిరసిస్తూ ఈ నెల 14 నుంచి 28వరకు పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఏజెంట్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొని మాట్లాడుతు ఐఆర్డీఏ నిర్ణయంతో పాలసీదారులకు, ఏజెంట్లకు ఇబ్బంది అవుతుందన్నారు.

కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తారా?

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఈఎస్ఐ ఆసుపత్రి కార్మికులతో పనులు చేయించుకుంటూ వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయిస్తారా..? అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సంగారెడ్డి కలెక్టరేట్ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఈఎస్ఐ హాస్పిటల్ కార్మికులు ధర్నా చేశారు. రామచంద్రాపురం పరిధిలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకుంటే ఎలా బతుకుతారని సాయిలు ప్రశ్నించారు.